క్లుప్తంగా

దివ్యాంగుల భవన నిర్మాణానికి సాయం



దివ్యాంగుల భవన నిర్మాణానికి సాయం అందిస్తున్న గ్రామస్తులు

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం ఆవరణలో దివ్యాంగ చిన్నారుల పునరావాసం కేంద్రం కోసం నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి పలు గ్రామాల ప్రజలు ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి, హరిపురం, బొడ్డకాలి, మండపల్లి, రత్తకన్న, కొలిగాం గ్రామాల ప్రజలు రూ.40వేలు ఆర్థిక సాయాన్ని సంస్థ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్‌కు గురువారం అందజేశారు.

108 అంబులెన్సు పరిశీలన



అంబులెన్సును పరిశీలిస్తున్న డివిజనల్ అధికారి జగన్నాథరావు

కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు రూరల్: పలాస మండల కేంద్రంలో ఉన్న 108 అంబులెన్సులను డివిజనల్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు, ఫ్లీట్ మేనేజర్ రామకృష్ణ గురువారం పరిశీలించారు. వాహనాల నిర్వహణ తీరు తెన్నులు, అత్యవసర మందుల రికార్డు, డ్యూటీ చార్ట్ పరిశీలించారు. మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది బర్తిని తారకేశ్వరరావు, పాశాల సత్యం, ఎస్.వెంకటరావు, శ్రీనివాసరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం, కొళిగాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ లైన్ విద్యుత్ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈదుపురం, డొంకూరు, కేశుపురం, ధర్మపురం, తులసిగాం, కొఠారీ, బిర్లంగి, కొళిగాం, బి.తోటూరు, తేలుకుంచి, హరిపురం గ్రామ విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

సోంపేట: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో సభలు, సమావేశాలు, ఉత్సవాల సమయంలో బాణసంచా కాల్చడం నిషేధించినట్లు తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు.

రికవరీలు శతశాతం ఉండాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

వజ్రపుకొత్తూరు రూరల్ : స్వయం సహాయక సంఘ సభ్యులు తీసుకున్న సీఐఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి రుణాలకు సంబంధించి రికవరీలు శతశాతం ఉండాలని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందస మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలు మొబైల్ బుకింగ్ టైమ్ షెడ్యూల్ ప్రకారం అప్‌డేట్ చేయాలన్నారు. చిన్న సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య కోశాధికారి విజయశ్రీ, కళ్యాణి, వీఓఏలు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొర్లె నాగేశ్వరరావు ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా గురువారం రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్‌లో ఘనంగా సన్మానించారు. ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సత్యసాయి కన్వీనర్ మల్లా రామేశ్వరం, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, పాట్నూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- పలు ఆలయాల్లో కల్యాణోత్సవాలు
- గ్రామాల్లో ఘనంగా సంబరాలు



కాశీబుగ్గ: లోకనాథీశ్వరుని కల్యాణం

కాశీబుగ్గ : మున్సిపాలిటీలోని కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ఉన్న లోకనాదీశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా కల్యాణం అనంతరం పదకొండు రోజులు తిరువీధి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శంకు విశ్వనాథం తెలిపారు.

తిరుక్కల్యాణోత్సవాల ముగింపు..

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగలో కోదండరామస్వామి అర్ధశతాబ్ది తిరుక్కల్యాణ మహోత్సవాలు, కవిటిలో వెలసిన పట్టాభి రామాలయంలో నిర్వహించిన 78వ తిరుక్కల్యాణ మహోత్సవాలు గురువారంతో కన్నుల పండువగా ముగిశాయి. బ్రహ్మపురానికి చెందిన అంపోలు అనంత శ్రీనివాసాచార్యులు కవిటి పట్టాభి రామాలయంలో బల్లెడ కామరాజు దంపతులు, నారాయణమూర్తి దంపతులు, ప్రగడపుట్టుగలో అంపోలు వంశీఆదిత్యాచార్యుల పర్యవేక్షణలో బల్లెడ ఎర్రప్ప దంపతులచే పాంచరాత్ర ఆగమ సంప్రదాయం మేరకు తిరుక్కల్యాణ మహోత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వైశాఖశుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి కోట్నం దంపు వసంతోత్సవం, చక్రతీర్థ స్నానాలు, హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం ఆరాధనల్లో భాగంగా ద్వాదశారాధన, విశేష పూర్ణాహుతి, సప్తావరణలు, శ్రీపుష్పయాగం, పవళింపుసేవ, ద్రావిడ ప్రబంధాధ్యయనం, మంగళాశాసనాలతో ఉత్సవాలు ముగిశాయి.

వైభవంగా అసిరిపోలమ్మ సంబరాలు

కవిటి: మండలంలోని నెలవంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారిని గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణగా ఏర్పాటుచేసిన రథాలు, విచిత్ర వేషధారణలు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి.



కవిటి: పట్టాభిరామాలయంలో కొట్నం దంపు



కవిటి: పట్టాభిరామునికి చక్రతీర్థ స్నానం



కవిటి: నెలవంకలో అసిరిపోలమ్మ అమ్మవారి ఊరేగింపు



కవిటి: నెలవంకలో ఏర్పాటుచేసిన మహిషాసుర మర్దిని ప్రళయతాండవం ఘట్టం

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ



ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: ప్రభుత్వం సమగ్ర శిక్షాభియాన్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని కవిటి ఎంఈఓ ధనంజయ మజ్జి అన్నారు. గురువారం మండలంలోని కళింగపట్నం, కుసుంపురం, చిన్నబల్లిపుట్టుగ, మున్నిపుట్టుగ, దూగానపుట్టుగ తదితర గ్రామాల్లో ప్రత్యేక అవసరాల విద్యను అందించాల్సిన బాలబాలికల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకు 18 మంది పిల్లలను గుర్తించామని ప్రత్యేక అవసరాల విద్య ఉపాధ్యాయులు లమ్మత కృష్ణారావు, అరుణ్ తెలిపారు. వీరికి కవిటి మండల ప్రత్యేక అవసరాల విద్యాకేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు.

కాశీబుగ్గ: మందస మండలంలో జూన్ 9 వరకు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-1, 2లు ఎం.లక్ష్మణరావు, ఎం.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం హరిపురం, కొండలోగాం, పట్టులోగాం, తెంతులిగాం, పిడిమందస, ఛత్రపురం, దేవుపురం గ్రామాల్లో దివ్యాంగులను గుర్తించారు. పూర్తి వివరాలకు 9182976342 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పీఎం జన్మాన్ పథకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి

హిరమండలం: ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ యోజన (పీఎం జన్మాన్)పై అవగాహన కలిగి ఉండాలని సీతంపేట ఐటీడీఏ టీఎంపియూ ఫైనాన్స్ ఏపీఎం సుబ్బయ్యనాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో వీఓఏలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉన్న ఏడు విద్యావికాస్ కేంద్రాల్లోని సభ్యులకు పీఎం జన్మాన్ పథకం అవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. గిరిజన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ తెగల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనదిశగా పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీ శ్రీనివాసరావు, స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, సీసీలు అసిరయ్య, అప్పన్న, శ్రీదేవి, జయంతి, సుజాత, అకౌంటెంట్ బేబీ ఉన్నారు.

పరీక్ష కేంద్రం మార్చాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు

నరసన్నపేట: జంబ్లింగ్ పద్ధతిలో జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల కోసం కేంద్రాలను ఏర్పాటు చేయడంలో అవకతవకలు జరిగాయని, నరసన్నపేటలో ఓ ప్రైవేటు కళాశాలలో కేటాయించిన సెంటర్‌ను మార్చాలని ప్రైవేటు కళాశాల యాజమాన్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. నరసన్నపేటలో మంజూరు చేసిన రెండు సెంటర్లలో సంపత్‌సాయి కళాశాలకు సెకెండ్ ఇయర్ విద్యార్థులు పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వడం శోచనీయమన్నారు. స్థానిక ప్రైవేటు జూనియర్ కళాశాలల యజమానులు రంగరావు, చిన్నబాబు, టి.జగదీశ్వరరావు, రమణమూర్తి గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. సంపత్ సాయి కేంద్రాన్ని మార్చాలన్నారు. ఇదే కళాశాలలో చదివి తప్పిన విద్యార్థులు ఇప్పుడు అక్కడే పరీక్షలు రాస్తున్నారని.. ఇలా ఎప్పుడూ జరగలేదన్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు, ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అదే కళాశాలలో చదివిన విద్యార్థులు అక్కడే పరీక్షలు రాస్తే వారికి ప్రయోజనం కలుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. ఇది జంబ్లింగ్ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. సెల్ఫ్ సెంటర్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను విలేకర్లకు చూపించారు.

27న అమరవీరుల స్మారక సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విప్లవ పార్టీ నాయకులు

పలాస: మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 27న సాయంత్రం 5గంటలకు జరుగనున్న జిల్లా అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయాలని వివిధ విప్లవ సంఘాల, పార్టీల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1969 మే 27న జిల్లాలో మొదటి సారిగా జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆనాటి సి.పి.ఐ.ఎం.ఎల్ రాష్ట్ర నాయకులు పంచాది కృష్ణమూర్తితో పాటు ఏడుగురు విప్లవకారులు మృతిచెందారని గుర్తు చేశారు. నాటి శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో 360 మంది బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా మరణించారని పేర్కొన్నారు. నాటి అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని ప్రజాపోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.పి.ఐ. ఎం.ఎల్ లిబరేషన్ సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు గౌరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, పోతనపల్లి మల్లేశ్వరరావు, మద్దిల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై క్రీడాకారులకు అవగాహన

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోని క్రీడా వికాస కేంద్రంలో క్రీడాకారులకు సీపీఆర్‌పై గురువారం అవగాహన కల్పించారు. గుండెపోటు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇండియన్ ఎమర్జెన్సీ మెడికల్ అసోషియేషన్ ప్రతినిధి రవికుమార్ రెడ్డి వివరించారు. క్రీడాకారులు ఇటువంటి ఇబ్బందులకు గురవుతుంటారని, వారిని రక్షించే క్రమంలో సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ ఎస్.శేఖర్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఆటోస్టాండ్

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని ఆటోస్టాండ్ వద్ద కొద్దిరోజులుగా చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. బస్టాండ్, డివైడర్ మధ్య కూడా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దీంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పరిసరాలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

రుణాలు చెల్లించే సంఘాలకు చేయూత

జి.సిగడాం: అర్హులైన మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా ప్రత్యేక రుణాలను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీలరాణి అన్నారు. ఎందువ గ్రామంలో మహిళా సంఘ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించే స్వయం శక్తి సంఘాల సభ్యులకు ప్రత్యేక రుణాలు అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఇప్పటికే స్త్రీనిధి ద్వారా అర్హులైన సంఘ సభ్యులకు రుణాలను మంజూరు చేశామన్నారు.

26న రక్తదాన శిబిరం

రణస్థలం: మండల కేంద్రంలోని ఇదదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఇదదాసుల తిరుపతిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు సేవా ఫౌండేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే శిబిరాన్ని ఔత్సాహికులు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు 98480 04156 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నైపుణ్యాలతో ఉన్నత స్థాయి



శిక్షణ ఇస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ప్రతి విద్యార్థి నైపుణ్యాలు పెంచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా (జేసీఐ) జాతీయ శిక్షకురాలు పూసర్ల రజిత అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని వి.కె.పేట వద్ద ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులతో జేసీఐ జాతీయ శిక్షణ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ మెలకువలు నేర్చుకోవాలన్నారు. పట్టుదలతో శ్రమిస్తే మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీఐ ప్రాజెక్టు చైర్మన్ వి.రాము, అధ్యక్షులు షణ్ముఖరావు, స్వరూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యకు స్వర నీరాజనం

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంత్యుత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ వీధుల్లో శోభాయాత్ర కొనసాగించారు. అనంతరం అర్చకులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర శతనామాలతో అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.యోగేశ్వరరావు, కార్యదర్శి బెహరా నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, ఎం.కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– కత్తెరవీధిలోని రాజరాజేశ్వరీ దేవీపీఠం, శ్రీవారికి స్వరార్చన వాట్సాప్ గ్రూప్ సంయుక్త నిర్వహణలో తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవం వేడుకగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ ఉత్సవంలో పలువు గాయకులు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. ప్రీతి, మహతిల గాత్ర కచేరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో సింహాద్రి శ్రీనివాసరావు, సుసరాపు లక్ష్మీగణపతి శర్మ తదితరులు పాల్గొన్నారు.

– డీసీసీబీ కాలనీలో భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని సంకీర్తనాగానం చక్కగా సాగింది. శ్రీవాణి సంగీత కళాక్షేత్రం నిర్వాహకులు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు వీనుల విందుగా గానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బిర్లంగి రామ్మోహన్‌రావు, దుంపల సన్యాసిరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవం శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ వాడాడ, శృతిలయ సంగీత శిక్షణాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు



కాటాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజారమేష్

ఎల్.ఎస్.పేట: వ్యాపారులు కొలతల్లో అక్రమాలకు పాల్పడితే వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ రాజా రమేష్ అన్నారు. మండల కేంద్రం ఎల్.ఎస్.పేటలో తూనికలు, కొలతల విభాగం ఆధ్వర్యంలో కాటాలకు గురువారం సీళ్లను వేశారు. ప్రతీ వ్యాపారి విధిగా కొలత పాత్రలకు సీళ్లు వేయించుకోవాలన్నారు. అకస్మిక తనిఖీలు చేసే సమయంలో పట్టుబడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలుదారునికి సరైన కొలతలతో విక్రయాలు జరపాలని సూచించారు.

బీమా పరిహారం అందజేత



దేవికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

ఎల్.ఎస్.పేట: మండలంలోని రావిచంద్రి గ్రామానికి చెందిన పాదిలాపు భాస్కరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో అకౌంట్‌తోపాటు ప్రమాద బీమా పాలసీ కలిగి ఉన్నారు. దీంతో ఆయనకు రూ.20 లక్షల బీమా మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును బ్యాంకు రీజనల్ మేనేజర్ కె.అర్జునరావు మృతుని భార్య పాదిలాపు దేవికి గురువారం అందజేశారు. బ్యాంకు సేవలను గ్రామీణ ప్రజల వద్దకు తీసుకుని వచ్చే విధంగా బ్యాంకు మిత్రలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ ఒక్కరు ప్రమాద బీమా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీజీవీ బ్యాంకు బిజినెస్ ఎస్ఎం డి. ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ సందీప్, ఫీల్డ్ ఆఫీసర్ హేమలక్ష్మి, క్యాషియర్ ప్రతాప్, నోడల్ అధికారి వాసు, ఎస్‌బీఐ జనరల్ బీడీఎం వినీల్, రావిచంద్రి బ్యాంకు మిత్ర పునీత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
– శ్రీకాకుళం కల్చరల్